


వెళ్ళొస్తానండీ? అన్నది ఆవిడ.

"వెళ్ళిరామ్మా" అన్నది సత్యవతి.

ఆవిడ వెళ్ళిపోయింది.

"చూశారా సిస్టర్! ఆ అమ్మాయికి గర్భంరాగానే హిస్టీరియా దానంతటదే పోయింది." అన్నది మిడ్‌వైఫ్ శారద దూరాన వెడుతున్న ఆ అమ్మాయిని చూస్తూ.

"నువ్వింకా చిన్నదానివి. నీకు చెబితే మాత్రం అర్థమౌతుందా ? స్త్రీ భగవంతుని సృష్టికన్నా తన సృష్టినే ఎక్కువగా ప్రేమిస్తుంది. స్త్రీకి మాతృత్వంకన్నా పెద్ద కోరికలేదు. అర్థమైందా ?" అన్నది సత్యవతి.

శారద తల వూపింది.

"ఏమిటే అంతా అర్థమైనట్లుగా తలూపుతావు. నీ కర్థం కాలేదు. ఇది అర్థం కావాలంటే మరోవిషయం చెబుతాను విను."

శారద సత్యవతిముందు కూర్చుంది. సత్యవతి గతంలోకి అంతర్ముఖమైన చూపుతో- ప్రారంభించింది.

"....అర్థరాత్రి సమయం. ఆస్పత్రి లోని దీపాలు పాలవెన్నెల సోనల్ని కురిపిస్తున్నాయి....నాది రాత్రి డ్యూటీ : ఆ రోజు జాగ్రత్తగా చూడవలసిన కేసులు రెండే రెండు. ఒక కసుగందు. మరొక పచ్చిబాలెంత ! చీమ చిటుక్కుమన్నా వినిపించే నిశ్శబ్దంలో ఆ బాలెంత పడుకున్న మంచం కిర కిర లాడింది. త్వరగా ఆ పడకవద్దకు వెళ్ళాను. ఆమె కళ్ళు చికిలించి చుట్టూరా చూస్తున్నది.

"ఏమిటమ్మా పార్వతీ ?" అన్నాను తల నిమురుతూ.

ఎలక్ట్రిక్ దీపాలకేసి చూస్తున్న పార్వతి ఉన్నట్టుండి మంచాని కిరువైపులా చూసింది. అదిరిపడి తన పరుపుమీద తడివింది. క్షణంలో పార్వతి కళ్ళు కన్నీటి కొలను లయ్యాయి. నీరు నిండిన కళ్ళతో నా వైపు దీనంగా చూసింది. ఆ చూపులో ధ్వనించిన వేదన, ఆ చూపులో కణ కణ లాడుతున్న ప్రశ్న నా కర్థమైంది. కాని ఆ ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయాను.

"విశ్రాంతి తీసుకో పార్వతీ! ఇంజక్షను యిస్తాను" వెళ్ళిపోవడానికి వెనుదిరిగాను. నా గౌను కొస పార్వతి చేతిలో వుంది. పార్వతి బుగ్గలు కన్నీటితో తడిసిపోయాయి. ఆవిడ దుఃఖాన్ని చూడలేక నా గదిలోకి వచ్చేశాను. పార్వతి బెడ్ వద్ద నుంచి ఎక్కిళ్ళు వినబడుతూనే వున్నాయి; క్రిందటిరాత్రి పార్వతి నాకు చెప్పుకున్న దీన చరిత్ర నా మనసులో మెదల సాగింది....

పార్వతి భగవంతుడు సృష్టించిన స్త్రీ. అందం చిందే వయసూ, ఆర్ద్రిత తొణికే మనసూ ఆమె లక్షణాలు. పార్వతి మనసులో యవ్వనం మేల్కొనేసరికి ఆమె మనస్సు శేఖరానిదై పోయింది. శేఖరం

కాలేజీలో పార్వతికి ఒక సంవత్సరం సీనియరు. కాని పార్వతికి గిరిధర్ అని ఒక మేనమామ ఉన్నాడు. అతనికి పార్వతంటే చాలా అభిమానం. పార్వతి, శేఖరాలసంగతి గిరిధర్‌కు తెలిసి పార్వతిని అడిగాడు.

"ఔనుమామయ్యా ! నిజమే" అన్నది పార్వతి తలవంచుకొని.

"ఇది నీకు న్యాయమేనా పార్వతీ ?" ప్రశ్నించాడు గిరిధర్.

"క్షమించు మామయ్యా!" అనిపాదాలంటి ప్రార్థించింది పార్వతి. గిరిధర్ మనసున్నవాడు. పార్వతి మనసు తెలుసుకున్నాడు. ఆనాటినుంచీ పార్వతికి దగ్గర కావాలని అతడు ప్రయత్నించలేదు.

పార్వతి ఇంటరూ, శేఖరం బియ్యే పాసయారు. చంద్రశేఖరానికి మరుసటి సంవత్సరమే ఐ. ఏ. ఎస్ వచ్చింది. వారి వివాహం చాలా సామాన్యంగా జరిగిపోయింది. పార్వతి తల్లిని ఒంటరిదాన్ని చేసి హైదరాబాదు వెళ్ళిపోయింది."

"గిరిధర్ యేమయాడు ?" శారద ప్రశ్నించింది.

శారద ప్రశ్న సత్యవతికి వినిపించలేదు. శూన్యంలోకి చూసుకుపోతూ, సృష్టి రహస్యాన్ని చీలుస్తున్న చూపుతో చెప్పుకుపోతున్నది.

"పార్వతి భర్తకు స్వర్గాన్ని చూపింది. వాళ్ళిద్దరూ వలపు కొమ్మకు పూచిన రెండు పూవుల్లా గడిపారు ఒకసంవత్సరం. ఒక ఆదివారం ఇద్దరూ పబ్లిక్ గార్డన్స్‌కు వెళ్ళారు. పచ్చటి తివాసీలాంటి పచ్చిక మీద కూర్చున్నారు. నీలిబట్టమీద తెగిపడ్డ ముత్యాల్లా నక్షత్రాలు మెరుస్తున్నాయి. లేతవలపులా మందంగా వీస్తున్న పిల్లగాలి. ఇద్దరి మనసుల్లోనూ సందడి చేస్తున్న మధురభావాలు !

శేఖరం పార్వతి బుగ్గలు తాకి తుళ్ళిపడ్డాడు.

"పారూ ! జ్వరంగావుందా ?" ప్రశ్నించాడు.

"లేదు" అన్నది పార్వతి సిగ్గుతో.

పార్వతి కళ్ళల్లో, బుగ్గల్లో వెలిగిన సిగ్గు శేఖరానికి కనిపించలేదు.

"పద ఇంటికెళదాం. డాక్టరుకు చూపించాలి" అన్నాడు మళ్ళీ.

"అబ్బా, నాకు జ్వరం లేదంటే వినరేం !"

"లేదంటావేమిటి, శరీరం యింత వేడిగా వుంటే ?"

పార్వతి అసలు విషయం చెప్పాలని ఎంత ప్రయత్నించినా సిగ్గుతో చెప్పలేకపోయింది.

మరుసటి రోజు యింటికెళ్ళగానే డాక్టరు కోసం కబురంపాడు శేఖరం. అంతలోనే ఆఫీసు నుంచి తొందరగా రమ్మని ఫోను వస్తే శేఖరం వెళ్ళిపోయాడు. "డాక్టరుగారొస్తారు. జాగ్రత్తగా పరీక్ష చేయమను. ఓ అరగంటలో వస్తాను" అంటూ వెళ్ళాడు శేఖరం.

మరో అరగంటలో డాక్టరు వచ్చింది. పార్వతిని పరీక్షించి చివరకు ప్రశ్నించింది.

"నీకు అమ్మాయి కావాలా ? అబ్బాయా ?"

పార్వతి నేలను చూస్తూ నిలుచుంది.



"మరీ అంత సిగ్గు తగదమ్మాయ్ ! నే వెడతాను. శేఖరంగారు వస్తే చెప్పు— అబ్బాయి నిస్తానని"

"ఏమండీ డాక్టరుగారూ ! నాకు అదో రకంగా వుంటుందండీ....మీరే చెప్పండి"

"ఊఁ హూఁ....నే చెప్పను. నువ్వే చెప్పాలి. అలా చెప్పడంలో గొప్ప ఆనందం వుంది. దాన్ని పోగొట్టుకోకు" డాక్టరు వెళ్ళిపోయింది.

డాక్టరు పార్వతికి కొత్తగా చెప్పిన విషయం యేమీ లేదు. ఆ సంగతి పార్వతికంతకు ముందే తెలుసు. కాని, భర్తకు సిగ్గుతో చెప్పలేకపోయింది. ఇక చెప్పక తప్పదు. ఎలా చెప్పాలని ఆలోచిస్తూ కూర్చున్న పార్వతికి శేఖరం ఆఫీసు డ్యూటీ మీద పొరుగూరు వెళ్ళాడని, సాయంకాలం వస్తాడని ఫోను వచ్చింది. పార్వతి చాలా నిరాశ పడిపోయింది. కాని ప్రతి క్షణమూ భర్త కోసం యెదురు చూస్తూ కూర్చుంది....సాయంకాలమైంది. సంజ చీకట్లు పలుచగా వ్యాపించి కారు చీకట్లయ్యాయి. పార్వతి మగతగా కన్ను మూసింది. చాలా సేపటి తర్వాత యెవరో తలుపు తట్టారు. పార్వతికి మెలకువ వచ్చింది. ఇంతసేపూ అనుకున్న దేదీ స్ఫురించలేదు. [illegible] ఆలోచించింది .... తలుపు తీయాలి. భర్త లోపలికి రాగానే భుజాలమీద చేతులేసి, అతని గుండెల్లో తల దాచుకుని, తన సోగ కళ్ళతో అతని కళ్ళల్లోకి చూస్తూ "మీకు కొడుకు కావాలా - కూతురు కావాలా ?" అని ప్రశ్నించాలి. అప్పుడు అతని హృదయంలోని సంతోషాన్ని వింటూ, అతని కళ్ళలోని సంతోష తరంగాల్ని చూడాలి. మెల్లిగా తలుపు తీసి ఒదిగి నిలబడింది పార్వతి. శేఖరం లోపలికి రాలేదు. బయటికి తొంగి చూసింది. పోర్టికోలో నిలిచిన జీపులోంచి నలుగురు పట్టి, రక్తపు ముద్దలా వున్న శేఖరం శరీరాన్ని మోసుకొచ్చి హాల్లో వున్న సోఫాలో పడుకోబెట్టారు. కెవ్వున అరిచి, నేలకూలింది పార్వతి. తర్వాత కొన్ని రోజులకు తన పసుపు కుంకుమలు కారు ప్రమాదంలో చనిపోయిన శేఖరాని కర్పించి, అతని అంశను మోసుకొని తల్లి వద్దకు చేరింది. సత్యవతి ఆగి కథ వింటున్న శారదను చూసింది.

శారదకు సత్యవతి మబ్బు మబ్బుగా కనిపించింది. "చెప్పండి సిస్టర్" అన్నది కళ్ళు తుడుచుకుంటూ.

తన కడుపులో కదులుతున్న శేఖరం అంశను చూసుకొని దుఃఖాన్ని దిగమింగుతూ....కానుపుకు ఆస్పత్రిలో చేరింది పార్వతి. అంతకుముందు అప్పుడప్పుడూ ఆస్పత్రికి వచ్చేది. పార్వతిని చూసి ఆశ్చర్యపోయేదాన్ని. స్త్రీకి మాతృత్వం అంత బలమైన వాంఛ అన్న సంగతి పార్వతిని చూస్తేకాని నాకు అర్థం కాలేదు. ఆమెలోవున్న వాంఛ దావాగ్నిలాంటిది. మాతృత్వం కోసం ఆవిడ భగవంతుణ్ని కూడా తృణీకరిస్తుందనిపించేది నాకు.....

పార్వతినిగురించి యిలా ఆలోచిస్తున్న నన్ను ప్రక్కనే వున్న వుయ్యాలలోంచి ఏడ్చిన పాప వాస్తవ జగత్తులో పడేసింది. పాప ఏడుపు దూరాన పడుకున్న పార్వతి

---

● నటీనటులు ఆడేది ఏనాటకమైనా, బాగుండకపోతే, ప్రేక్షకులు ప్రదర్శించేది పాదుకా పట్టాభిషేకమే.

ఎక్కిళ్ళతో కలిసి వినిపిస్తోంది. ఫ్లాస్కు లోంచి పాలుతీసి పత్తిని పాలలో తడిపి ఆ కనుగందుననోట్లో పిండాను. నిదానంగా గుటకలు వేసింది పాప. పాపకు పాలు పోసి వెనక్కి తిరిగేసరికి పార్వతి నిల బడి వుంది. ఆవిడ ఉయ్యాలలో పడుకున్న పాపను నిశితంగా పరిశీలిస్తోంది."

"ఏం పార్వతీ ?" అన్నాను.

"నా పాప" అన్నది.

"లేదమ్మా ! నువ్వు దక్కేసరికే చాలా కష్టమైపోయింది."

"నా పాపకు లేకపోతే నేనెందుకూ ? నేనూ చచ్చిపోతాను."

"తప్పు పార్వతీ ! అలా అనకూడదు"

"నా పాపకు నాకు కావాలి" అన్నది మూర్ఖంగా.

చాలా కష్టంమీద పార్వతిని పడుకో బెట్టి, మళ్ళీ లేచి అల్లరి చేస్తుందేమోనని నిద్రకు ఇంజక్షనిచ్చాను. మనసులో అంత కల్లోలం వున్నా పార్వతి నిద్రపోయింది.

నాకూ చాలా అలసటగా వుండటంవల్ల నేనూ టేబిలు మీద తల వాల్చాను. మళ్ళీ నాకు మెలకువ వచ్చేసరికి తెల తెల వారు తోంది. అదే సమయానికి అతనూ పాల ఫ్లాస్కుతో లోని కొస్తున్నాడు.

"ఎలా వుందండీ అమ్మాయి ?" ఉయ్యాలలో నిద్ర పోతున్న పాపను చూస్తూ అడిగాడు.

"బాగానే వుందండీ. కానీ, యింకా నాలుగైదు రోజులు ఆస్పత్రిలోనే వుంచాలి" అన్నాను.

"వారెవరు సిస్టర్ ?" శారద సత్యవతి మాటలకు అడ్డం వచ్చింది.



"ఆయన ఆ వూళ్ళో పెద్ద వ్యాపారి. అతని భార్య ప్రసవించి చనిపోయింది. అతని కూతురే ఆ కళ్ళు తెరవని కసు గందు. తర్వాత ఉయ్యాల ప్రక్కనే కూర్చొని, భార్యను తలచుకొని పేగులు కుళ్ళిపోయేలా యేడ్చాడు. మరి కాస్సేపటికి పగలు డ్యూటీ స్టాఫ్ వచ్చారు. వారికి పార్వతి విషయాన్ని చెప్పి యిల్లు చేరాను.

మళ్ళీ నేను ఆస్పత్రికి వెళ్ళేసరికి సాయంకాలం ఆరు గంటలైంది. వెడుతూనే అడిగాను.

"పాప ఎలాగుంది ?"

"బావుంది"

"పార్వతి ?"

"ఇప్పుడే నిద్ర లేచింది. బలవంతంగా కొంచెం ఆహారం యిచ్చాము. ఏడుస్తూ పడుకుంది" అన్నది డ్యూటీ నర్సు.

నేను గదిలో కెళ్ళగానే పార్వతి వచ్చింది. "రా పార్వతీ ! కూర్చో" అన్నాను.

కూర్చుంది.

"ఏమిటమ్మా ?"

"నాకు యిక్కడ అదోరకంగా బాధ.... గా....వుందండీ" అన్నది అరచేత్తో రొమ్ము రుద్దుకుంటూ.

"దానికి మందిస్తాలే తల్లీ! తగ్గిపోతుంది"

"ఎప్పటికి తగ్గుతుందో యేమో ! చూడండీ - చాలా బాధగా వుంది. లోపల యేదో కదులు తున్నట్లుగా, గుండె బరువెక్కి పోయినట్లుగా వుంది"

"అది బాధ కాదమ్మా ! పాలు పడ్డాయి. ఇప్పుడు తీసేసి పాలు పోవటానికి మంది స్తాను. బాధ తగ్గిపోతుంది.

"తీసేయట మెందుకండీ ! ఈ పాప



కిస్తాను." అన్నది ఉయ్యాలలోని పాపను చూపుతూ. పార్వతి ఆ మాట అంటున్న ప్పుడు ఆవిడ కళ్ళు జ్యోతుల్లా వెలిగాయి.

"అలా యివ్వ కూడదమ్మా ! మొదట తీసేయాలి"

"అలాగా !" అన్నది పార్వతి.

తర్వాత మిడ్‌వైఫ్‌ను పిల్చి శారదను లోనికి తీసుకెళ్ళ మన్నాను.

ఎనిమిది గంటల ప్రాంతంలో వార్డు బయట నిలబడి వున్న నా వద్దకు పరు గెట్టు కొచ్చింది మిడ్‌వైఫ్.

"ఎందుకే అంత గాభరా ?" విసుక్కు న్నాను.

"ఉయ్యాలలో పాప కనిపించటం లేదండీ" అన్నది.

నా కర్థమైంది - పాప యెవరి వద్ద వున్నదో. సరాసరి పార్వతి మంచం వద్దకు వెళ్ళాను. పాపను కొంగులో దాచుకొని పాలిస్తోంది పార్వతి. పార్వతి ముఖంలో యేదో అనంతమైన శాంతి తాండవ మాడు తోంది. పాపను గుండెల్లో దాచుకుంది నన్ను చూసి.

"పాపను యివ్వు పార్వతీ !" చాలా మృదువుగా అన్నాను.

"ఇవ్వను పో" అన్నది.

"ఎందుకూ ?"

"ఈ పాప నాది"

"కాదమ్మా ! నీ పాపడు పోయాడు"

"అంతా అబద్ధం"

"కాదమ్మా....!"

"పాపను యివ్వను, యివ్వను, యివ్వను" వెర్రిగా అరిచింది.

ఇంతలో పాప నాన్న వచ్చాడు.

"ఇలా చూడు పార్వతీ ! ఈ పాప వీరి కూతురు. వారు వచ్చారు. పాపను వారి కివ్వమ్మా !" అన్నాను అతణ్ని చూపుతూ.

ఒక్కసారిగా అదిరి పడింది పార్వతి. అతణ్ణి చూడగానే సందేహం, భయం పార్వతి కళ్ళలో వ్యాపించాయి. పాప నెత్తుకొని లేచి నిలబడింది. పాప నోటి చివరనుండి పాలు కారుతున్నాయి. అతను కూడా పార్వతిని చూసి స్థాణువులా నిల బడి పోయాడు. "పాపను తీసుకోండి" అన్నాను.

అతను ముందుకు పోయి చేతులు చాచాడు. కానీ పాప నలిగి పోయేలా గుండెలకు హత్తుకుంది పార్వతి.

"ఈ పాపను నా కివ్వు మామయ్యా ! నువ్వు మంచివాడివి కదూ ? పాపను నాకు యివ్వవూ ?"

నా ఆశ్చర్యానికి హద్దుల్లేవు.

"ఏమండీ ! మీకు పార్వతి తెలుసా ?" అడిగాను.

"తెలుసు....పార్వతి మా...."

"మీ పేరు ?"

"గిరిధర్"

పార్వతిని పెళ్ళి చేసుకోవా లనుకొని నిరాశ పడ్డ గిరిధర్ యితడే ! "ఇలా ఒక సారి వస్తారా ?" వార్డ్ బయట తోటలోకి నడుస్తూ గిరిధర్‌ని పిలిచాను.

"ఎందుకండీ పిల్చారు ?" అన్నాడు గిరి ధర్ తోటలో.

"పార్వతి పాప కోసం ఎలా తల్లడిల్లి

● గయ్యాళిదాని భర్త : "అమ్మో! అయ్యో!" అని బాధపడ కూడదు. "అత్తో, మామో!" అని మూలగాలి.

పోతోందో మీరు చూశారు కదూ! మీ పాపకూ పాలు కావాలి. అందువల్ల పార్వతి ఆస్పత్రిలో వున్న నాలుగు రోజులూ మీ పాప పార్వతి దగ్గరే వుంటే మీకేమైనా అభ్యంతరమా?"

గిరిధర్ జవాబు చెప్పలేదు.

"మీకు యిష్టం లేకపోతే వద్దులెండి"

"ఇష్టమే ననుకోండి .... కానీ నేను కూడా నా పాపను విడిచి బ్రతకలేక పోతున్నాను. రేపటినుంచి నెల రోజులు ఫ్యాక్టరకి వెళ్ళదలుచుకో లేదు. ఇప్పుడు పాపను యింటికి తీసుకెళ్ళాలని వచ్చాను. నా భార్య నా కెలాగూ దక్కలేదు. నా పాపలో ఆవిడను చూసుకుంటూ బ్రతుకుతాను సిస్టర్! నేనూ, నా పాపా చాలా దురదృష్ట వంతులం" గిరిధర్ కంఠం గద్గదమైపోయింది.

"తొందర పడకండి గిరిధర్! పాప మరి నాలుగు రోజులు యిక్కడే వుండటం మంచిది. చంటి పాపను పెంచడం తేలిక పని కాదు. అంతేకాదు, చాలా కారణాలున్నాయి. పాపను నాలుగు రోజులు యిక్కడే వుంచాలి" అన్నాను. సరేనన్నాడు గిరిధర్.

నేనూ గిరిధర్ లోపలి కొచ్చేసరికి పాపను పక్కలో పడుకో బెట్టుకొని జో కొడుతోంది పార్వతి. బుగ్గల మీదా, గడ్డం మీదా పాల మరకలున్న పాప పిడికిళ్ల బిగించి, ఓరగా నవ్వుతూ నిద్ర పోతోంది.

తర్వాత నాలుగు రోజులు పార్వతి ఆనందానికి పట్టపగ్గాలు లేకపోయాయి. పాప నవ్వితే తానూ నవ్వుతూ, పాపతో బాటు తానూ ఏడుస్తూ ఆ నాలుగురోజులూ గడిపింది పార్వతి. మరునటి రోజు ఒక వూహించని సంఘటన జరిగింది. మరునటి రోజునుంచీ తనకు పాప దక్కదన్న బాధతో పాపను తీసుకు పారిపోవాలని ప్రయత్నించింది పార్వతి. కాని వీలుకాలేదు. పాపను రహస్యంగా పొత్తిళ్ళలో దాచుకొని కాంపౌండు దాటుతుండగా పట్టుబడిపోయింది. కాంపౌండు దాటగలిగినా పాప తనకు లభించదన్న ఆలోచన లేదు, పార్వతికి. ఆవిడ వున్న స్థితిలో అంత దూరం ఆలోచించే విచక్షణ ఆవిడకు లేదు.

ఈ విషయం ఏలాగో గిరిధర్‌కు తెలిసింది. ఒక్క పరుగున ఆస్పత్రికి వచ్చాడు. పార్వతి చేతిలో వున్న పాపను నిర్దయగా లాక్కున్నాడు. పార్వతి ఏడ్చింది. మొత్తుకుంది. గోడకేసి తల బాదుకుంది. కాని పార్వతిని లాగి మంచం మీదికి తోసి పాపను లాక్కొని యింటికెళ్ళిపోయాడు గిరిధర్.

ఆ రోజు పార్వతి తల్లి పార్వతిని యింటికి తీసుకెళ్ళిపోయింది. అప్పటి పార్వతి రూపాన్ని చూసి నాకు కళ్ళు తిరిగాయి. కృశించిన ముఖం, చెదరిన కోరికలాంటి జుట్టు, నిరాశ నీడలు దట్టంగా వున్న కళ్ళు, మనసులోని మాతృత్వం వల్ల నిండుగా పొంగిన వక్షస్సు - ఆ రూపాన్ని చూడలేకపోయాను. పార్వతి తల్లిని దూరంగా పిలిచి పాలు పోవటానికి మందిచ్చి, ఎలాగైనా పార్వతికి త్రాగించమన్నాను...వాళ్ళు వెళ్ళిపోయారు. నేను మిగిలిపోయాను. తర్వాత రెండు రోజులు నాకు అన్నం రుచించలేదు. కన్నుమూసినా తెరచినా దైన్యం కన్నీరుగా కారుతున్న కళ్ళతో పార్వతి కనిపించేది. ఆవిడ హృదయంలో ఝరీపాతంగా ప్రవహిస్తున్న మాతృత్వాన్ని బలవంతంగా అణచివేసిన పాపానికి భగవంతుడు నా కెలాంటి శిక్ష విధిస్తాడోనని వణికిపోయేదాన్ని. మరునటి రోజు సాయంకాలం పార్వతితల్లి వచ్చింది. మందు పార్వతి కివ్వటానికి వీలులేకపోయిందనీ, పార్వతి పారిపోవాలని ప్రయత్నిస్తున్నదనీ, యిప్పుడు గదిలోపెట్టి తాళం వేసి వస్తున్నాననీ చెప్పింది. నాకేమీ తోచలేదు. రాత్రికి పార్వతిని చూడటంకోసం వాళ్ళింటి కొస్తానని చెప్పాను.

ఆరోజు నాకు డ్యూటీ లేదు. సాయంకాలం చీకటి పడగానే పార్వతిని చూట్టానికి బయలుదేరుతుండగా గాభరాగా గిరిధర్ లోపలకొచ్చాడు.

"పాపకు చాలా సుస్తీగా వుందండీ. కళ్ళు తెరవటమేలేదు. మీరు ఒక్కసారి వచ్చి చూడాలి. ప్లీజ్" అన్నాడు కన్నీళ్ళతో.

నా మనస్సు కలత పడిపోయింది. పార్వతిని తర్వాత చూడవచ్చుననుకొని గిరిధర్‌తో బయలుదేరాను. గిరిధర్‌ది చాలా పెద్దయిల్లు. వరదతీసిన తర్వాత కనబడే నిశ్శబ్దబీభత్సం ఆ యింటిని పాలిస్తోంది. గిరిధర్ ఒంటరివాడు. జీవన పథంలో తోటి బాటసారిని పోగొట్టుకున్నవాడు....అతనికి తోడూ నీడా ఆ కసుగందే!

పాపను చూసి ఏవో మందు పోశాను. కానీ పాప కళ్ళు తెరవలేదు. బలంగా వూపిరి పీలుస్తూ పడుకొనివుంది. నేను యింటికి వెడతానంటే మరికాస్సేపు వుండమన్నాడు గిరిధర్. పార్వతిని చూట్టానికి ఉదయం వెళ్ళవచ్చుననుకొని సరేనన్నాను. గంట పది దాటింది. కష్టాల మేఘాలు కప్పుకున్న గిరిధర్ బ్రతుకులా వుంది ఆకాశం. పాపను చూసినప్పుడు అతడిలో తళుక్కుమనే ఆశలాంటి చిన్న చిన్న చుక్కలు మేఘాల సందున మిల మిల లాడుతున్నాయి....ఎవరో తలుపు తట్టారు. ఆలోచనల్లో కూరుకుపోయి కూర్చున్న గిరిధర్ వెళ్ళి తలుపు తీశాడు. పెనుగాలిలా లోపలికొచ్చింది పార్వతి. వస్తూనే గిరిధర్ పాదాలవద్ద పడి భోరున ఏడ్చింది. దిగాలు పడి నావైపు బేలగా చూశాడు గిరిధర్. పార్వతిని లేవనెత్తి కళ్లు తుడుస్తూ అడిగాను.

"ఎందుకమ్మా యింత రాత్రిపూట యిలా వచ్చావు?"

పార్వతి జవాబు చెప్పలేదు. రెండు చేతులతోనూ రొమ్ములు కప్పుకుంటూ భయంతో చూస్తోంది.

"చెప్పమ్మా." అన్నాను మళ్ళీ.

నూనెలేని ప్రమిదెలోని దీప శిఖలా రెప రెప లాడిపోతోంది పార్వతి. ఉయ్యాల వద్దకు పరుగెత్తి పాపనందుకుంది.

"ఇలా తే పాపను" పార్వతి చేతుల్లోని పాపను గుంజుకున్నాడు గిరిధర్.

పాప కేరుమంది.

"ఒక్కసారి....ఒక్కసారే! పాపకు పాలిచ్చి వెళ్ళిపోతాను మామయ్యా! ఒక్కసారేమామయ్యా....మీరు చెప్పండి" నన్ను కౌగలించుకుంది పార్వతి. ఆ కౌగిలిలో నా ఎముకలు పొడైపోతాయేమో ననిపించింది.

"వెళ్ళమ్మా. ఇవ్వు" అన్నాను.

"వీల్లేదండీ ! ఇది రాక్షసి. పాప నేమైనా చేస్తుంది" అన్నాడు గిరిధర్.

"ఫరవాలేదులెండి. నువ్వు యివ్వు పార్వతీ ! మనం మేడ మీద కెడదాం రండి" అన్నాను.

గిరిధర్ క్షణం తటపటాయించి, పాపను పార్వతి చేతి కిచ్చి నన్ను అనుసరించాడు.

పార్వతి పాప నందుకుంది. పాప మాంగల్యం లేని పార్వతి మెడను తాడుతోంది.

నేనూ, గిరిధర్ మేడ మీది కెళ్ళాము. గిరిధర్‌కు చెప్పాలనుకున్న ఒక మాట నా మనసులో మెదిలింది. కానీ, నాకూ గిరిధర్‌కూ వున్న పరిచయం చాలా తక్కువ. అందువల్ల సాహసించలేక పోయాను. పాపను తీసుకొని పార్వతి పారి పోతుం దేమో నన్న భయంకొద్దీ గిరిధర్ నాలుగు వైపులా జాగ్రత్తగా చూస్తున్నాడు. అర్థ గంట తర్వాత దిగి వచ్చాము. పాపను హృదయానికి హత్తుకొని పడుకుంది పార్వతి. పాప చేయి పార్వతి మెడమీద వుంది. నేను గిరిధర్‌ను చూశాను. అతని కళ్ళ నీళ్ళ నిండాయి. పెదవులు వణుకుతున్నాయి. నా హృదయం సంతోషంతో గంతేసింది.

"నేను వెడతాను: రిధర్‌గారూ" అన్నాను.

నా మాటలు గిరిధర్‌కు వినిపించ లేదు.

కానీ నేను వచ్చేశాను. మరుసటి రోజే నాకు బదిలీ వచ్చింది. అప్పు డప్పుడూ పార్వతీ గిరిధర్ జ్ఞాపకం వచ్చేవారు. ఏమయ్యారో, ఎలా వున్నారో అనుకునే దాన్ని. ఇలా మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. ఒకరోజు రేణిగుంట రైల్వేస్టేషన్‌లో నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను.


కదులుతున్న రైల్లోంచి గిరిధర్‌నూ, పార్వతినీ చూశాను. గిరిధర్ వేలు పట్టుకొని మెల్లిగా అడుగు లేస్తున్న పాప ! పార్వతి చంకలో ఆరునెల్ల కుర్రాడు ! పార్వతి మహా లక్ష్మిలా కనిపించింది. సరిగంచు తెల్ల చీర పైటలోంచి మాంగల్యం తళ తళ లాడుతోంది. పచ్చటి ఫాల మధ్యంలో ఎర్రటి కుంకుమ వెలిగి పోతోంది. ప్లాట్‌ఫారం మీద వారు కనిపించే దాకా కళ్ళారా చూశాను. అంతే ! మళ్ళీ ఈనాటివరకూ వాళ్ళు నాకు కనిపించలేదు...." సత్యవతి ఆగి చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకుంది.

ఆశ్చర్యంతో విశాలాలైన కళ్ళతో శారద సత్యవతి ముఖం లోకి చూస్తూ కూర్చున్నది. ●

---

● ఎడారిలో ఒక రోజున తొంభై తొమ్మిది ఉష్ట్రపక్షులు ఇసకలో తలలు దూర్చి పడుకున్నాయి. వాళ్ళని చూడ్డానికివచ్చిన నూరో ఉష్ట్రపక్షి "ఏమై పోయారబ్బా వీళ్లంతా" అని ఆశ్చర్యపోయింది.





డ్రాడిల్స్

వీటి వివరణకు 86 వ పేజీ చూడండి. చూసేముందు మీరుకూడా కాసేపు ఆలోచించరాదూ ?